క్లుప్తంగా

ఉర్దూమీడియం పాఠశాలను అభివృద్ధి చేయాలి

కొత్తూరు: మండలంలో కొనసాగుతున్న ఉర్దూ మీడియం పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలని మైనార్టీ సంఘం నాయకుడు లతీఫ్ గురువారం ఒక ప్రకటనలో విద్యాశాఖ అధికారులను కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలను స్వంత భవనానికి మార్చాలని పేర్కొన్నారు. ఇక్కడ తగినంత బోధన సిబ్బంది కూడా లేరని గుర్తు చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బీజేపీ బలోపేతానికి కృషి

రుద్రారం గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి



మహేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపేందర్‌రెడ్డి, రాఘవేందర్

షాబాద్: కార్యకర్తలు బీజేపీ బలోపేతం కోసం కృషి చేయాలని రుద్రారం గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పార్టీ బలోపేతం కోసం పనిచేస్తామన్నారు. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై మరోసారి బీజేపీకి పట్టం కట్టడం ఖాయమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గ్రామాల్లో నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న గోపాల్‌రెడ్డి

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పామెన మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని పామెన గ్రామంలో గురువారం రూ. 5లక్షలతో ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి గ్రామాలకు భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పలు కాలనీల్లో సీసీ రోడ్లను వేయిస్తున్నట్లు చెప్పారు. ప్రజల సహాయ సహకారాలతో గ్రామాని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రగోపాల్, చంద్రారెడ్డి, రాములు, ప్రమోద్, విఠల్, కరుణాకర్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు భవనాలు నిర్మించాలి

తలకొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించాలని గిరిజన ఐక్య వేదిక మండల కోఆర్డినేటర్ కొర్ర కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గిరిజన నాయకులతో కలిసి ఆయన ఎంపీడీఓ శ్రీకాంత్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని సూర్యానాయక్ తండా, లక్ష్మి తండాలలోని అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని కృష్ణ నాయక్ చెప్పారు. భవనాలకు అవసరమైన నిధులు మంజూరు చేసి నూతన భవనాలు నిర్మించాలని కోరారు.

నిత్యం ట్రాఫిక్ జాం!



బస్టాప్‌లో వాహనాలు పార్కు చేయడంతో నడిరోడ్డులో నిలిపిన ఆర్టీసీ బస్సు

దుకాణాల ముందు చిన్న, చిన్న బండ్ల ఏర్పాటు

- రోడ్లపైనే పార్కింగ్
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు

మొయినాబాద్: రోజురోజుకు పార్కింగ్ సమస్య తీవ్రమవుతుంది. ప్రధాన రహదారికి ఇరుప్రక్కల ఉన్న షాపుల ముందు స్థలం వదలకుండా బండ్లు ఏర్పాటు చేయడంతో దుకాణాలకు వచ్చేవారు తమతమ వాహనాలను రోడ్లుపైనే నిలుపుతున్నారు. దీంతో ప్రతీనిత్యం మొయినాబాద్ ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య వస్తుంది. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న మండల కేంద్రంలో ఈ సమస్య తలెత్తుతుంది. జాతీయ రహదారికి ఇరు ప్రక్కల సుమారు అర కిలోమీటర్ మేర వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. కానీ వాటి ముందు పార్కింగ్ చేసుకోవడానికి స్థలాలు లేవు. ఉన్న కొద్ది పాటి స్థలాన్ని సైతం యజమానులు చిన్న చిన్న బండ్లు, కొట్లు పెట్టుకోవడానికి అద్దెకు ఇస్తున్నారు. ఆయా షాపులకు, దుకాణాలకు వెళ్లినవారు తమతమ వాహనాలను రోడ్లపైనే నిలిపేయడంతో ఇబ్బందిగా మారుతుంది.

నింబధనలు గాలికొదిలేసి లైసెన్సులు జారీ..

గ్రామాలు, పట్టణాల్లో ఎలాంటి షాపులు ఏర్పాటు చేసినా వాటికి పంచాయతీ, మున్సిపల్ అధికారుల నుంచి ట్రేడ్‌లైసెన్సు తీసుకోవాల్సి ఉంటుంది. మొయినాబాద్ గ్రామ పంచాయతీ కావడంతో అధికారులే జారీ చేస్తారు. ఏ రకమైన షాపు ఏర్పాటు చేస్తున్నారు? పార్కింగ్ స్థలం ఉందా? లేదా? ఖాళీ స్థలం ఎంత ఉంది. వంటి విషయాలను పరిగణలోకి తీసుకొని అధికారులు లైసెన్సులు ఇవ్వాలి. ఈ విషయంలో షాపుల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమ షాపు ముందు సుమారు 20నుంచి 30 అడుగుల రోడ్డు స్థలాన్ని కబ్జాచేసి వాటిలో బండ్లు, కొట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. వారి వద్ద నుంచి రోజు వారిగా అద్దె వసూలు చేసుకుంటున్నారు. రూ. లక్షల్లో దండుకుంటున్నారు. షాపుల ముందు అక్రమంగా రేకుల షెడ్లు ఏర్పాటు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు.

వీఐపీ రూట్.. మారని పరిస్థితి..

కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో హైదరాబాద్-బీజాపూర్ రహదారిని వీఐపీ రూట్‌గా ప్రకటించారు. ముఖ్యమంత్రి కొడంగల్ వెళ్లాలంటే ఇదే రూట్‌లో వెళ్లాల్సి ఉంటుంది. అందుకే పోలీసులు వీఐపీ మూమెంట్ రూట్‌గా ప్రకటించారు. కానీ అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని స్థానికులు చెబుతున్నారు. మొయినాబాద్ ప్రధాన చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తి కిలోమీటర్ల మేర అంతరాయం కలుగుతుంది. ఈ విషయంలో పోలీసులు చలాన్లకు ఫొటోలు తీయడానికే పరిమితవుతున్నారే తప్పా సమస్యను పరిష్కరించడంలేదు. దీంతో నిత్యం ఈ రహదారిపై వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం మొయినాబాద్‌లో సంత ఉండడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుంది.

చర్యలు తీసుకుంటాం..

సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నాం. రోడ్డుకు ఇరుపక్కల షాపుల ముందు జ్యూస్ బండ్లు, టీకొట్లు, చాట్‌బండార్, తోపుడు బండ్లు పెడుతున్నారు. దుకాణాల ముందు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపై వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. అలాంటి వాటిపై చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం. బస్టాపుల వద్ద పార్కింగ్ చేసే వాహనదారులపై చర్యలు తీసుకుంటాం.

– బోస్‌కిరణ్, ట్రాఫిక్ సీఐ, రాజేంద్రనగర్

ఖాళీ స్థలాలనూ వదలడంలేదు..

షాపుల యజమానులు డబ్బులకు కక్కుర్తి పడి ఖాళీ స్థలాలను కూడా వదలడంలేదు. పార్కింగ్ స్థలం లేకుండా ఖాళీ స్థలాలను అద్దెకు ఇచ్చి డబ్బులు దండుకుంటున్నారు. షాపులకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్లపైనే ఆపడంతో ట్రాఫిక్ పోలీసులు ఫొటోలు తీసి చలాన్లు వేస్తున్నారు.

– మండడి వెంకట్‌రెడ్డి, మొయినాబాద్

రోడ్డుపైనే వాహనాలు..

మొయినాబాద్ బస్‌స్టాపుల్లోనే ఆటోలు నిలుపుతుండడంతో బస్సులను రోడ్డుపైనే ఆపాల్సివస్తుంది. దీంతో వెనుక నుంచి వచ్చిన వాహనాలు, బస్సుల వెనుకాలే ఆగడంతో బస్సులు కదిలేంత వరకూ ట్రాఫిక్‌లో ఉండాలి. బస్‌స్టాపుల వద్దే బ్యాంకులు ఉండటంతో రోజువారి అవసరాలకు వచ్చే వారు రోడ్డుపైనే తమ వాహనాలను నిలుపుతున్నారు. అదే విధంగా రోడ్డుకు ఇరుపక్కల, దుకాణాల ముందు టీ పాయింట్లు, జ్యూస్ బండ్లు, పానిపూరీ బండ్లు ఏర్పాటు చేయడంతో పార్కింగ్‌లకు స్థలం లేకుండా పోతుంది. అక్రమంగా ఏర్పాటు చేస్తున్న బండ్లను తొలగించడంలో పంచాయతీ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

కొనగట్టు శివాలయంలో కొనసాగుతున్న పూజలు



చేవెళ్ల: కొనగట్టు శివాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



కొందుర్గు: మహాపడిపూజలో శివభక్తులు

చేవెళ్ల: మండలకేంద్రంలోని కొనగట్టు శివాలయంలో రెండోరోజు గురువారం ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవ పూజలు కొనసాగాయి. కొనగట్టు శివాలయంలో కొలువు దీరిన శ్రీ భ్రమరాంభ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు, హోమం నిర్వహించారు. ఉదయం పునఃపూజా, రుద్రాబిషేకం, సహస్ర బిల్వార్చన, అమ్మవారికి సహస్ర పుష్పార్చన, రుద్రహోమం, పూర్ణాహుతి, మంగళ హారతులు, అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు, ఆలయ చైర్మన్ సున్నపు వసంతం, మాణిక్య ప్రభులు తెలిపారు. శివరాత్రి పండుగకు శివాలయం వద్ద పెద్ద ఎత్తున భక్తుల తాకిడి ఉంటుందని దానికి తగిన విధంగా ప్రత్యేక ఏర్పాట్లు సైతం చేయనున్నట్లు తెలిపారు.

కొందుర్గులో..

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గురువారం గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలచారి మాట్లాడుతూ నియమ నిష్టలతో స్వామివారిని కొలిస్తే ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, సత్యనారాయణ, యాదయ్య, నర్సింలు, హరీశ్, అంజి పాల్గొన్నారు.

9, 10న వాలీబాల్ టోర్నమెంట్

చేవెళ్ల: ఈ నెల 9, 10న ఓపెన్ టూ ఆల్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని దామరగిద్ద గ్రామానికి చెందిన సీనియర్ నేషనల్ వాలీబాల్ క్రీడాకారుడు బోడ అనిల్‌కుమార్ స్మారకార్థం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు విభాగాలుగా ఈ పోటీలు ఉంటాయని ఓపెన్ టూ ఆల్ విభాగంలో అన్ని రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఓపెన్ టూ ఆల్ విభాగంలో మొదటి బహుమతి రూ. లక్ష, రెండో బహుమతి రూ.50వేలు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధి విజేత జట్టుకు రూ. 70వేలు, రెండో బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ. 30వేలు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 7, 8 తేదీల్లో జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ల 9652367268, 9989379147, 7680988771, 903218840పై సంప్రదించాలని కోరారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కౌన్సిలర్ కొందూటి మహేశ్వరి



బోరు మోటార్‌ను ప్రారంభించిన మహేశ్వరి

షాద్‌నగర్: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వార్డుల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కౌన్సిలర్ కొందూటి మహేశ్వరి తెలిపారు. గురువారం పట్టణంలోని 20వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు మోటార్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేశ్వరి మాట్లాడుతూ ఎండా కాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మంచినీటి సమస్య తలెత్తే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. మంచినీటిసమస్య అధికమించేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నీటి సమస్య తీవ్రరూపం దాల్చితే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వహీద్, శివ, అనూప్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి



గ్రామ కమిటీల మహిళలతో ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి పేర్కొన్నారు. గురువారం షాబాద్, కేశవగూడ గ్రామాల్లో కాంగ్రెస్ మహిళా గ్రామ కమిటీలను నియమించారు. చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఏబ్లాక్ అధ్యక్షురాలు పీసరి అనితారెడ్డి, షాబాద్ మాజీ సర్పంచ్ తమల్లి సుబ్రమణ్వేశ్వరిలతో కలిసి ఎనుకున్నారు. ఈ సందర్భంగా పామెన జ్యోతి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లోనూ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలన్నారు. చేవెళ్ల నుంచి కచ్చితంగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తారని జోస్యం చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టులు 40 ఏళ్లు దాటినా చెక్కు చెదరలేదని గుర్తు చేశారు. తెలంగాణ సాధించాక కట్టిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు నాగమణి, నాయకులు రవీందర్, రాములు, శివకుమార్, కృష్ణ, శ్రీను, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

కేశవగూడ గ్రామ కమిటీ..

కేశవగూడ కాంగ్రెస్ మహిళ గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా బాలమణి, ఉపాధ్యక్షురాలు భారతమ్మ, ప్రధాన కార్యదర్శిగా సరస్వతి, కార్యదర్శులుగా నందిని, రత్నమ్మ, సహాయ కార్యదర్శులుగా బుచ్చమ్మ, అమృత, జయమ్మలను ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

షాబాద్ ..

షాబాద్ కాంగ్రెస్ మహిళా గ్రామ కమిటీ అధ్యక్షురాలుగా భాగ్యమ్మ, ఉపాధ్యక్షురాలుగా కవిత, కార్యదర్శులుగా రమాదేవి, సుగుణ, సహాయ కార్యదర్శిగా లలితలను ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

నేడు ఎమ్మెల్యేల చలో 'లక్ష్మీదేవిపల్లి'



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

కొందుర్గు: లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు సందర్శిస్తారని జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో పాలమూరు, రంగారెడ్డి జిల్లా ప్రజలకు సాగునీరు, తాగునీరు అవసరాల కోసం లక్ష్మీదేవిపల్లి ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మిస్తామని నమ్మించి ఎన్నికలు ముగిశాక ఆ ఊసే ఎత్తలేదని విమర్శించారు. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించే స్థలాన్ని పరిశీలించేందుకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు శుక్రవారం సందర్శించనున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో చంద్రబాబు గౌడ్, అజ్జు, మక్సూద్, మల్లేశ్, జంగయ్య పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



చెక్కులు పంపిణీ చేస్తున్న రాము

బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము

షాబాద్: విద్యార్థులు 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలని బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము పేర్కొన్నారు. గురువారం షాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500ల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, శివ, రాజేశ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కేశంపేట: మండల పరిధిలోని కేశంపేట గ్రామంలో దవళగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వాహకులు చేపట్టారు. గ్రామానికి చెందిన తలసాని పద్మ వెంకట్‌రెడ్డి, మమత వెంకట్‌రెడ్డి, నీరజ రాంమోహ్మన్‌రావు దంపతులు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తలసాని వెంకట్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. ఎంపీపీ ఎల్లగమోని రవీందర్ యాదవ్, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, రమణారెడ్డి, దత్తురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ విలువలు నేర్పించండి

శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఆనంద్

షాద్‌నగర్ రూరల్: పిల్లలకు చిన్నతనంనుంచే కుటుంబ విలువలు, బంధాలను నేర్పించాలని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్లో ప్రిన్సిపాల్ ఆనంద్ ఆధ్వర్యంలో ఫ్యామిలి ఫెస్ట్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ తల్లితండ్రులను తాతయ్య, అమ్మమ్మలతో కలిసి తమకు నచ్చిన బహుమతులను తీసుకొని పాఠశాలకు వచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆనంద్ మాట్లాడుతూ పిల్లలకు తమ తల్లితండ్రుల గొప్పతనాన్ని తెలియచేయాలని చెప్పారు. తాతయ్య అమ్మమ్మ, తాతయ్య, నానమ్మల ప్రేమానురాగాలను అందించాలన్నారు. ఈ పోటీ ప్రపంచంలో తమ పిల్లల చదువుల కోసం తల్లితండ్రులు పట్టణాలకు వలసలు వస్తున్నారన్నారు. దీంతో కుటుంబం ఒకేచోట కలిసి ఉండకపోవడంతో పిల్లలకు పెద్దల ప్రేమానురాగాలు, ఆప్యాయతలు, బంధాలు బంధుత్వాలు తెలియకుండా పోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ విలువలు తెలియజేయాలనే లక్ష్యంతో ఈ ఫెస్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, స్టేట్ అకాడమిక్ కో ఆర్డినేటర్ జయరాజ్, వీజీఎం భాస్కర్, మధు, అరుమల్‌రెడ్డి, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

112 మంది గైర్హాజరు

షాద్‌నగర్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. షాద్‌నగర్‌లో మొత్తం ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 422మందికి గాను 407, మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 197గాను 193, ప్రతిభ బాలికల కళాశాలలో 370కి 336, విశ్వభారతి కళాశాలలో 413గాను 396, విజ్ఞాన్ కళాశాలలో 422గాను 409, విజేత కళాశాలలో 355గాను 326 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం అన్ని పరీక్షా కేంద్రాల్లో 2,179గాను 2,067 పరీక్ష రాసినట్లు, 112మంది గైర్హాజరు అయినట్లు కస్టోడియన్ అధికారి శ్రీకాంత్ తెలిపారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ..

పట్టణంలోని విజ్ఞాన్, విజేత, విశ్వభారతి జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని కస్టోడియన్ అధికారి శ్రీకాంత్ తెలిపారు.

ఇనుప సామాన్ల లోడు అడ్డగింత

పరిశ్రమ యజమాని రాకతో శాంతించిన గ్రామస్థులు



వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

నందిగామ: ఐరన్ పరిశ్రమలకు చిన్న చిన్న ఇనుప ముక్కలు, మొళలు, పాత ఇనుప సామాన్లను తరలించే లారీలు, డీసీఎంలను నందిగామ గ్రామస్తులు టీ టైం చౌరస్తాలో గురువారం అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..మండల కేంద్రమైన నందిగామ శివారులోని అంతిరెడ్డిగూడ రోడ్డులోని ఓ ఐరన్ పరిశ్రమకు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి పాత ఇనుప సామాన్ల లోడుతో లారీలు, డీసీఎంలలో నిత్యం వస్తుంటాయి. ఆ వాహనాలు వెళ్తున్న సమయంలో వాటిలోనుంచి చిన్న చిన్న ఇనుప ముక్కలు, మొళలు, నట్లు రోడ్లపై పడుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. వాటి వల్ల ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాల టైర్లు ఆ ఇనుప ముక్కలు గుచ్చుకొని తరుచూ పంక్చర్లు అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయా పరిశ్రమలకు వెళ్తున్న డీసీఎం వాహనాల నుంచి పెద్ద ఎత్తున ఇనుప ముక్కలు, మొళలు కిందపడటాన్ని గమనించిన నర్సప్పగూడ గ్రామస్తులు ఆగ్రహంతో ఆ వాహనాలను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పరిశ్రమ ప్రతినిధి అక్కడికి చేరుకోవడంతో స్థానికులు అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై ఇష్టాను సారంగా, నిర్లక్ష్యంగా వాహనాలలో నింపుకొని ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా తీసుకెళ్లడంపై ఆయనపై మండిపడ్డారు. ఇక నుంచి తగిన జాగ్రత్తలు తీసుకుంటామని ప్రతినిధి హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. మరోసారి ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఆందోళన చేసిన వారిలో కాట్న సురేందర్, నీరటి రవీందర్, నీరటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.